

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## మంత్రుడు

ఓపెనింగ్ షాట్ లో నా ఎర్ర వేనొచ్చి డ్రైవ్ వే లో ఆగింది. డోరు తీసి నేను దిగాను. చచ్చిన గేద్దూడంత బరువున్న నా లాప్‌టాప్ సంచీకి నన్ను తగిలించుకుని, ఓ పక్కకి వొరిగిపోతూ గృహప్రవేశం చేసా. *"దీని దుంప తెగ, ఏవుంటుందో లోపల, ఇంత బరువు.."* అనుకుంటూ.

అప్పటికే మిగితా రెండు శాల్తీలు వచ్చేసాయి. చిన్న శాల్తీ లెఖ్ఖలు చేస్తోంది, పెద్ద శాల్తీ చెబుతోంది...*" మైనస్ అంటే.."* అడిగింది గెట్టిగా.

*"ఎడిషన్"* భయపడుతూ చెప్పింది చిన్న శాల్తీ. ఒఖ్ఖ గెంతులో వంటింట్లోంచి పిల్లమీదకి కుప్పించి ఎగసి, పిడికిళ్ళు బిగించి ఊగిపోతూ అడిగింది.

*"మై...న...స్....అంటే...."* .

*"స...స...స...బ్..ట్రాక్షన్.."* అంది బిక్క చచ్చిపోతూ నా కూతురు. నేనీ జీవహింస చూడలేక ,

*"దా తల్లీ నేను చెబుతాను లెఖ్ఖలు. "* అంటూంటే ఒక్క సారి నా వొళ్ళోకి జంప్ చేసి, బల్లిలా అతుక్కుపోయింది నా కూతురు.

*"ఓహో, ట్వెంటీ వన్ లోంచి థర్టీన్ తియ్యాలి. ముందు వన్‌లోంచి త్రీ మైనస్ చెయ్యగలవా?"* అడిగాను కోర్టు సీనులో హీరోకి హెల్ప్ చేసే లాయర్ లా.

*"నువ్వు నేర్పిస్తే చేస్తా.."* అంది నా కూతురు.

*"అది కాదే, స్మాల్ నెంబర్ లోంచి బిగ్ నెంబర్ మైనస్ చెయ్యగలవా?"* అన్నాను వళ్ళు మండి.

"లేను.".

*"అప్పుడేం చెయ్యాలి.."* అడిగాను ఓర్పుగా. అది ఆలోచిస్తోంది. నాలో ఉత్సాహం పెరిగిపోయింది. దాన్ని ప్రోత్సహిస్తూ ప్రశ్న రెట్టించాను, కనుబొమలెగరేస్తూ .

*"కమాన్ చెప్పు, అప్పుడేం చెయ్యాలి.."* అన్నాను సుడిగుండాల్లో ఏఎన్నార్ లా చేతులూపుతూ.

*"ఫస్టు వినాయకుడికీ, తరవాత సరస్వతీ దేవికీ దణ్ణం పెట్టుకోవాలి.."*

" ??????"

ఓమాటు నిస్సహాయంగా చూసి,

*"ఐ రెస్ట్ మై కేస్.."* అంటూ నిర్దాక్షిణ్యంగా నాకూతురుని మా ఆవిడకప్పగించేసి, పైకెళ్ళి డ్రెస్సు మార్చుకొచ్చి టీ తాగుతుంటే *" ఇదిగో, మళ్ళీ టెన్నీసా? మీరా టెన్నీసన్నా మానెయ్యండి, ఉజ్జోగవన్నా మానేయండి.."* అంది లేని కోపం తెచ్చిపెట్టుకుంటూ.

*"రేపొద్దున్న పదింటికల్లా చెబుతా.."* అన్నాను టీకప్పు కిందపెడుతూ.

*"ఏం, అప్పుడుగానీ రావా, అమృతఘుడియలు?"* అంది ఉడికిస్తూ.

*" పొద్దున్నే వెళ్ళి వాళ్ళ లేప్ టాప్పూ, బేడ్జీ వాళ్ళ మొహాన పారేసి వచ్చేస్తాను, అప్పుడింక డౌటుండదు..."* అన్నాను నవ్వుతూ.

*"మీరా దిక్కుమాలిన టెన్నీసుకెళ్ళారంటే వల్లకాదు. పొద్దున్నకి పొద్దున్న ఆఫీసు, సాయంకాలాలు టెన్నీసూ. ఒళ్ళుటంటే ఒళ్ళుపనవట్లేదు కొంపలో. కాసేపు పిల్ల సంగతి పట్టించుకోండి, నేను వంట చేసుకోవాలి "* అనేసి కిచెన్‌లో కెళ్ళి పోయింది.

ఇంక చేసేది లేక బేలగా పిల్లకేసి చూసాను. అది అప్పటికే *"అవున్నాన్నా, ఇప్పుడు నన్ను పట్టించుకో. వుండు ఛెస్సు బోర్డు పట్టుకొస్తాను. "* అనేసి , అరసెకనులో అన్ని పావులూ సర్దేసింది. ఆ ప్రక్రియ అయ్యాకా, దానికి కాస్త తెలుగు పాఠం చెప్పేసరికి ఎనిమిది. మధ్యలో నా ముగ్గురు మిత్రులు, నానా బూతులూ తిడుతూ టెన్నీసు కోర్టునించి సెల్‌ఫోన్ లో మెసేజిలు, ఇంకెప్పుడూ నీతో ఆడం అంటూ.

సీన్ కట్ చేస్తే, శనివారం సాయంకాలం ఒక గంట టైము దొరికింది ఫ్రెండుగాళ్ళతో కష్టం సుఖం చెప్పుకోడానికి. అప్పుడన్నాను, *"లాభం లేదురా, ఒళ్ళుళ్ళం, ఎన్నని చెయ్యగలం, ఆఫీసు కెళ్ళాలి, నిద్ర ఆపుకుని పని చెయ్యాలి, కూరలు తేవాలి, పిల్ల సంగతి చూడాలి, షాపింగులూ, కోచింగులూ.. వల్ల కాదురా బాబూ. పోనీ ఎవరన్నా యంగ్ అండ్ బ్యూటిఫుల్ విడోని మన వూరినించి తెచ్చుకుందామని అలోచిస్తున్నాను, కాస్త వంటకీ, దానికీ సాయంగా ఉంటుంది"*.

*" దేనికీ? "* అన్నాడు వెంకట్ నవ్వుతూ.

*"ఆ ముక్క మీ ఆవిడకి చెప్పు, అమాంతం నీ పీకి పిసికేసి, తనే టైటిల్ రోల్ తీసేసుకుంటుంది "* అన్నాడు భాస్కరరామం. వాడెప్పుడూ ఇంతే, చిలిపి. ఇంతలో జయభేరి పాట లో చెప్పినట్టు **" యజమాని ఆనతిచ్చిన గడువు"** పూర్తవడంతో నందుడు (నేనే) ఇంటికొచ్చేసాడు. లాభంలేదు ఏదో ఒహటి చెయ్యాలి అని ఆలోచిస్తూండగా ఒక మెరుపు మెరిసింది. ఎప్పుడూలేనిది, అబ్బులుగాడి అమ్మ మొగుడిలాంటి అవిడియా వచ్చేసింది. అంతే, వెంఠనే సైంటిస్టు వంశీధర్ కి ఫోన్ చేసేసాను. మూడో రోజుకల్లా నేనే నాముందు కూర్చుని ఉన్నాను. వెనకాల ఐప్యాడ్‌లో స్విచ్చు నొక్కుకుపోయి పాట మొదలైపోయింది "యంత్రుడా, ఓ యంత్రుడా.." అంటూ. నేను యంత్రుణ్ణి కాదు, మంత్రుణ్ణి, "ఇహహహ" అనుకుంటూ, బోలెడు డబ్బులుపోసి కొన్నాను. ఓ మాటు టెస్ట్ చేద్దామని

బటన్ నొక్కాను. *"హాయ్, అయాం శీను. వెయిస్ట్ ఫార్టీ, వెయిట్ టూఫార్టీ. ద్రా.పి ఎడుస్సు కూచిమించార్గ్రహారం, అమలాపురం. చెప్పండి, ఏమి కార్యము నెరవేర్చుటకు నన్ను తలిచారు? "*

*"చెబుతాగానీ, ముందు ఆ ముదనష్టపు డబ్బింగ్ సినిమా భాష ఆపు చేయి"* అంటూ వాడికి కాస్త బేసిక్ ట్రయినింగిచ్చేసాను. పెళ్ళాం ముందెలాగూ వినయమే భూషణం, విన్నదే చెయ్యడం కాబట్టి, అక్కడంత ట్రైనింగవసరం లేకపోయింది. పిల్ల దగ్గిర కాస్త జాగ్రత్తగా ఉండాలి కాబట్టి, రెండు మూడు స్టెప్పుల తరవాత చెస్‌లో ఎలా ఓడిపోవాలో, తెలుగు పద్యాలు ఎలా చెప్పాలో వాడికి నేర్పించేసాను. దాంతో కొన్ని సాయంకాలాలు వాడు మేనేజ్ చేసేసాడు, నా టెన్నిసుకి ఢోకా లేకండా. నాకూ ప్రాణంలేచొచ్చినట్టుంటోంది. వాణ్ణి నేనున్నపుడు బేస్మెంట్‌లో దాచిపెట్టి బానే నెట్టుకొస్తున్నాను. మా ఆవిడ ఆనందం తరచూ బజ్జీలుగా, బోండాలుగా పళ్ళెంలోకొచ్చేస్తోంది. ఇలా దర్జాగా జరిగిపోతున్న సమయంలో ఒకానొక బలహీన క్షణంలో నోటి దూల ఎక్కువై, చెప్పేసాను వాడిగురించి మా ఆవిడకి. అప్పట్నించీ **"మరి చెప్పరేం"** అంటూ వాణ్ణి పూర్తిగా పనిలోకి దింపింది. ఇల్లు క్లీనింగు దగ్గరనించి, బట్టలు మడతపెట్టటం, పాలు తోడిపెట్టడం దాకా వాడే తల్లి తన తల్లి, పిల్ల తన పిల్ల, అందరూ వాణి ఇష్టం వచ్చినట్టు శాసించేస్తున్నారు. రోజుకి పన్నెండుసార్లు బాటరీ చార్జి చెయ్యలేక ఛస్తున్నాను.

ఒకరోజు రాత్రి భోజనాలవేళ వాడు పైకొచ్చేసాడు. నేను బంగాళదుంపల వేపడం, కొబ్బరికాయ మావిడికాయ పచ్చడి లోకంలో ఉన్నాను. వాడు చాలా సేపు నా అలౌకికానందాన్ని గమనించి వెళిపోయాడు. మర్నాటినించీ వేధించడం మొదలెట్టాడు. **"ఆనందం అంటే ఏమిటి?" "వేగిన దుంపలు అలా బంగారం రంగులో ఎందుకున్నాయి? మోక్షవంటే నీ మొహంలో కనిపించింది, అదేనా? "** ఇలా నన్ను వేపుకు తినేస్తుంటే, తట్టుకోలేక వాణ్ణి అప్‌గ్రేడ్ చెయ్యమని వంశీధర్ ని బతిమాలాను. వాడు మూడు చిప్పులు పంపించాడు. నీకు నచ్చింది తగిలించమని. అప్పటినించీ మొదలయ్యాయి కష్టాలు.

(ఎదర ఉంది ఎలిగేటర్ ఫెస్టివల్..)

****

---

"ఎవడ్రానువ్వు?"

*"అంటే..వుప్పుడు,రెండేళ్ళక్రితం వచ్చినప్పుడు "ఎవడ్రానువ్వు " అని అడిగారు చూడండి, వాణ్ణేనండి."*

"కాపీ జోకులకేంగానీ, కథేంటో చెప్పు.."

*"కథలూ, కబుర్లూ, కాదండి, ఈ సారి కాకరకాయలు.."*

"అబ్బో, పేరేం పెట్టేవేటి?

*"టేకిట్ ఈజీ అండి.."*

"తెలుగు పేరు దొరకలేదా?"

*"అంటే.. స్టయిలు గుంటది కదండి మరి.."*

"ఓర్నీ స్టయిలూడదొబ్బ , ఇంతకీ కితం పుత్తకానికేమాత్రం సంపాదించావేవిటి?"

"మైనస్ ఎనిమిదొందలండి..."

"రూపాయిలే..?"

"డాల్లర్లండి.."

"ఇంకా తీరలేదా బులపాటం?"

"ఓ పూట అన్నం మానేసి అర్టిపండు తినేద్దారని డిసైడయ్యానండి.."

"నిన్నా దేవుడు కూడా బాగుచేయలేడు రా .."

"మరేనండి .."

కాబట్టి ఇందు మూలముగా తెలియజేయున దేమనగా... మీరింతకాలమూ గోళ్ళు కొరుక్కుంటూ చదివిన టేకిటీజీ, ఇకపై పుస్తకముగా తీసుకుని వచ్చుటకు దైవజ్ఞులు నిశ్చయించినారు గాన, కొత్త సమచ్ఛరములో అపుడో, ఇపుడో, ఎపుడో టేకిటీజీ 24 ఎపిసోడ్ల పుస్తకముగా మీ ముందుకు వచ్చును. మీరు కాపీలు రిజర్వు చేసుకోదలచినచో, మాకు రాయుడి. ఇవియే అనేక శుభలేఖార్ధములు. ఈ మెయిలు: ఫణిడొక్కా ఎట్ యాహూ డాట్ కాం.

(ఒహోం ఒహోం హోం ఒహోం ఒహోం...)

**NEW**
Click here to share your comments on this story